E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 03-01-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక: 03|| పేజీలు–6 www.ekaburu.com




స్కోరు 750 దాటాలంటే » 4లో

## ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా

# ఫ్యూచర్ సిటీ



» తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
» ఏసీలు అవసరం లేకుండానే ఫ్యూచర్ సిటీకి ప్రభుత్వ నిర్ణయం
» 30 వేల ఎకరాల్లో నిర్మాణం జరగనున్న ఫ్యూచర్ సిటీ
» ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం అమలు
» కేంద్రీకృత శీతలీకరణ విధానం సిస్టంతో భవనాల నిర్మాణం
» ఏసీలతో పోలిస్తే 30 శాతం విద్యుత్ ఆదా
» గుజరాత్ లోని ఉన్న గిఫ్ట్ సిటీ మాదిరిగా తెలంగాణలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం

**(ఈ కబురు, హైదరాబాద్)**
తెలంగాణ ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మకంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోంది. ఈ భారత్ ఫ్యూచర్ సిటీ ప్రపంచం మొత్తం ఫోకస్ చేసేలా నిర్మాణం చేస్తుంది. నేటి ఆధునిక కాలంలో చిన్న కార్యాలయాల నుండి ఇళ్ళ వరకు ఏసీలు వాడుక అనివార్యమైన వేళ 30 వేల ఎకరాలలో నిర్మించాలి అనుకుంటున్న ఫ్యూచర్ సిటీలో ఏసీలు లేకుండానే, ఏసీ అవసరంలేని విధంగా నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ను అమలు చేస్తారు. తెలంగాణ విజన్ 2047 పత్రంలో ప్రకటించిన ఈ వినూత్న విధానం నగర నిర్మాణంలో కీలకం కానుంది. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రవేశ పెట్టనున్న డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ఒక కేంద్రీకృత శీతలీకరణ విధానంగా చెబుతారు. శుద్ధిచేసిన నీటిని 5డిగ్రీల సెల్సియస్ వరకు చల్లబరిచి ఆ నీటిని ప్రత్యేక పైపుల ద్వారా భవనాలకు పంపుతారు. ప్రతి భవనంలో ఉండే ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు ఈ చల్లని నీటిని ఉపయోగించి గది ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి. అనంతరం వేడెక్కిన నీటిని తిరిగి శీతలీకరణ కేంద్రానికి పంపి మళ్లీ చల్లబరిచి సరఫరా చేస్తారు. ఈ నిరంతర ఆవర్తనం వల్ల సాంప్రదాయ ఏసీలతో పోలిస్తే 30 శాతం విద్యుత్ ఆదా అవుతుందని అంచనా వేస్తున్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ వంటి విభాగాలతో అభివృద్ధి చెందుతున్న ఈ నగరంలో విద్యుత్ ఆదా చేయడం, పర్యావరణపరిరక్షణను చేయడం వంటి ప్రధాన లక్ష్యాలతో ఈ డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలుస్తోంది. నగరాలలో ఏసీలు వాడకం పెరిగిపోయి భరించలేని వేడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న క్రమంలో, ఈ సమస్యకు పరిష్కారంగా, డిసిఎస్ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది.

తరువాయి 2లో



## మంచు దుప్పట్లో....

# హైదరాబాద్

» అరకు, ఊటీ, కాశ్మీర్ లను తలపిస్తున్న నగర శివారు ప్రాంతాలు
» మంచుతో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు
» బెంగుళూరు జాతీయ రహదారిపై గంటల తరబడి నిలిచిపోతున్న ట్రాఫిక్
» పది అడుగుల దూరంలో వాహనాలు కనిపించక వాహనదారుల ఇబ్బందులు

**(ఈ కబురు, హైదరాబాద్)**
హైదరాబాద్ ను మంచు దుప్పటి కప్పేసిందా..? భాగ్యనగరం మరో ఊటీ, అరకు, కాశ్మీర్ లాగా మారుతుందా..!? అని అనిపిస్తుంది. అందుకు ప్రధాన కారణం నగర్ శివారు ప్రాంతాలను శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఈ మంచు వల్ల తెల్లవారుజాము నుంచే పరిసరాలన్నీ కాశ్మీర్ లోయను తలపించాయి. రోడ్లు, చెట్లు, భవనాలు సైతం మంచు వల్ల కనుమరుగయ్యాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మరీ ముఖ్యంగా హైదరాబాద్ శివార్లలో, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంనాగార్జునసాగర్ హైవే, శామీర్‌పేట్, మేడ్చల్, షామ్షాబాద్, ఆదిబట్ల, గండిపేట, కొంపల్లి, రాజేంద్రనగర్, కిస్మత్‌పూర్ ప్రాంతాలపై పొగమంచు ఎక్కువగా ఉంది.

తరువాయి 2లో

విరాట్ కోహ్లీని 2026లో ఊరిస్తున్న మూడు రికార్డులు ఇవే..! » 6లో




ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్లాంటులో వాణిజ్య ఉత్పత్తి » 4లో




వేసవిలో సాయిపల్లవి మేరే రహో » 5లో





'పుతిన్ ప్యాలెస్'.. ఈ నివాసం ఎప్పటికీ రహస్యమే..! తరువాయి 3లో



నేను ఆరోగ్యంగానే ఉన్నా: ట్రంప్ తరువాయి 2లో



టైగర్ సరసన కృతి శెట్టి? తరువాయి 5లో

జడల్ జమానా ఇది » 5లో





భారీ లాభాల్లో సూచీలు.. ఆల్‌టైమ్ గరిష్ఠానికి నిఫ్టీ » 4లో



90 రోజులు పనిచేస్తే గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత.. కేంద్రం డ్రాఫ్ట్ రూల్స్ » 4లో

## సంక్రాంతికి ఊరెళ్తున్నారా..

# జరభద్రం...



» అప్రమత్తంగా ఉండాలంటున్న సైబరాబాద్ పోలీసులు
» అనుమానితుల కదలికలపై సమాచారం అందించాలి
» కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం

» 3లో

## ఈవీఎంలకు జైకొట్టిన కర్ణాటక ప్రజలు..

# రాహుల్‌పై భాజపా సెటైర్లు



**ఈ కబురు బెంగళూరు:** ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ అనుమానాలు వ్యక్తం చేస్తోన్న వేళ.. కర్ణాటకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీ పై భాజపా విమ-

తరువాయి 3లో

# మూసీకి మహర్దశ



- మూసి పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా..
- రెండేళ్లలోపు గోదావరి నీళ్లను గండిపేటకు చేర్చనున్నట్లు సీఎం రేవంత్ స్పష్టం
- సంక్రాంతి నాటికి మొదటి దశ డీటెయిల్డ్ ప్రాజెక్ట్
- శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు సీఎం సమాధానం
- మరోవైపు సభలో కాంగ్రెస్, బి ఆర్ఎస్ నేతల మధ్య వాగ్వివాదం
- సభలో సీఎం మాట్లాడిన తర్వాత తమకు అవకాశం ఇవ్వకపోవడం పట్ల ఆగ్రహం
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద ఆందోళన
- గన్ పార్క్ వద్ద నిరసన తెలపాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించిన హరీష్ రావు

**(ఈ కబురు, హైదరాబాద్)**
మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా రెండేళ్లలోపే గోదావరి నీళ్లను గండిపేటకు చేర్చనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన మొదటిదశ డీటైల్డ్ ప్రాజెక్టు నివేదిక సంక్రాంతి నాటికి సిద్ధమవుతుందని, ప్రాజెక్టు వ్యయంపై స్పష్టత వస్తుందని ఆయన శాసనసభకు వివరించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు.

తరువాయి 2లో



మన పొరుగింటోళ్లు మంచోళ్లు కారు: కేంద్ర మంత్రి వ్యాఖ్యలు » 2లో

మొదటి పేజీ తరువాయి

# మూసీకి మహర్దశ





మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు మొదటిదశకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు 4 వేల కోట్ల రూపాయలకు పైగా రుణం అందించేందుకు సమ్మతించిందని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ప్రక్షాళన మాత్రమే కాదని, నదీ పరివాహ ప్రాంతంలో "నైట్ ఎకానమీ"ని అభివృద్ధి చేసే మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. రక్షణ శాఖ కూడా ఈ ప్రాజెక్టుకు 55 ఎకరాల భూములను బదలాయించేందుకు ప్రాధమికంగా అంగీకరించిందని, మరో వంద ఎకరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందని చెప్పారు.మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ఐదు దశలుగా చేపట్టేందుకు అధ్యయనం జరుగుతుందన్నారు.

ఐదేళ్ల పాటు సేవలందించేందుకు మూడు అంతర్జాతీయ కంపెనీల కన్సార్షియమ్ తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ఐదు దశలుగా చేపట్టేందుకు అధ్యయనం చేస్తున్నారని అన్నారు. మొదటి దశలో ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు, అలాగే హిమాయత్ సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు "వి" ఆకారంలో 21కిలోమీటర్ల పరివాహ ప్రాంతాన్ని మొదటిదశలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు సీఎం చెప్పారు.

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు వల్లసామాన్య ప్రజలకు, పేదలకు ఎలాంటి నష్టం జరగకుండా అత్యధిక పరిహారాన్ని ఇచ్చి, అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పునరావాసం కల్పించేందుకు, ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని స్పష్టం చేశారు. ఈ విషయమై శాసనసభ్యులు తగిన సూచనలు, సలహాలు ప్రభుత్వానికి ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వానిది ఓపెన్ అజెండానే తప్ప, ఏ అంశాన్ని దాచిపెట్టడంలేదని స్పష్టం చేశారు.మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై వచ్చే బడ్జెట్ సెషన్ సమయానికి శాసనసభ్యులకు మరింత స్పష్టత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కాగా, ఈ పథకంలో భాగంగా పాతనగరం సమీపంలోని మీరాలం ట్యాంక్ పై 450కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణ పనులు చేపట్టినట్టు, ఈ పనులు రెండేళ్లలో పూర్తవుతాయని పేర్కొన్నారు. పాతనగరాన్ని ఒరిజినల్ నగరంగా పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ను నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడతామని స్పష్టం చేశారు.

**––అసెంబ్లీ సమావేశాల వేళ బీఆర్ఎస్ అనూహ్య నిర్ణయం...!!**

ఇలా ఉండగా అసెంబ్లీ సమావేశాల వేళ బీఆర్ఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీలో అధికార కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేసీఆర్ పైన సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యల పై బీఆర్ఎస్ నేతలు మండి పడ్డారు. ముఖ్యమంత్రి సభలో మాట్లాడిన తరువాత తమకు స్పందించే అవకాశం ఇవ్వకపోవటం పైన బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలో స్పీకర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. గన్ పార్క్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించారు. కాగా శనివారం బి ఆర్ఎస్ భవన్‌లో కృష్ణా జలాలపై పవన్ పాయింట్ ప్రజెంటేషన్ కు డిసైడ్ అయ్యారు. అసెంబ్లీ సమావేశాలు బహిష్కరించాలని నిర్ణయం తీసుకు న్నట్లు హరీశ్‌రావు ప్రకటించారు. సీఎం వ్యాఖ్యలు, సభాపతి వైఖరికి నిరసనగా సమావేశాల బహి ష్కరణకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వచ్చినట్లు వివరించారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చారని మండిపడ్డారు బీఏసీలో నిర్ణయాలు ఒకటైతే, సభలో పెట్టింది మరొకటని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సభను బూతుల మయం చేశారని హరీష్ వ్యాఖ్యానించారు.సీఎం వ్యాఖ్యలపై నిరసనకు ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వలేదని వివరించారు. ప్రధాన ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకపోతే సభకు ఎందుకు రావాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని విమర్శించవద్దని స్పీకర్ ఎలా అంటారని నిలదీసారు. ప్రధానిని రాహుల్‌గాంధీ విమర్శించడం లేదా అని హరీష్ రావు ప్రశ్నించారు. మూసీ కంటే ముందు సీఎం నోరు ప్రక్షాళన చేయాలని వ్యాఖ్యానించారు. అసెంబ్లీని సీఎం గాంధీభవన్, సిఎల్పీ భేటీలా మారుస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ నుంచి గన్‌పార్క్ వద్దకు వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన వ్యక్తం చేసిన ఎమ్మెల్యేలు బిల్లులపై చర్చకు దూరంగా ఉండాలని డిసైడ్ అయ్యారు. శనివారం బిఆర్ఎస్ భవన్‌లో కృష్ణా జలాలపై పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని నిర్ణయించారు. కాగా సీఎం రేవంత్ మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు.

# మంచు దుప్పట్లో.... హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు ( ఓ ఆర్ ఆర్ ), వికారాబాద్ జాతీయ రహదారులు సైతం దట్టమైన మంచుతో కప్పబడ్డాయి. ముందు వెళ్లే వాహనాలు కనిపించకపోవడంతో ట్రాఫిక్ ముందుకు కదలడానికి తీవ్ర జాప్యం అవుతోంది. ఫాగ్ లైట్లు వేసినా రహదారి స్పష్టంగా కనిపించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. తెల్లవారుజాము నుండి 9 గంటలైనా పొగ మంచి వీడకపోవడం సూర్యుడు చంద్రుడిలా కనిపించడం చూపరులకు వింతగా అనిపిస్తుంది. ఆర్‌సీపురం నుండి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్, రుద్రారం, ముత్తంగి, ఇంద్రేశం వరకు రోడ్డు అంతా దట్టమైన మంచుతో కప్పేసింది. మరోవైపు ఇబ్రహీంపట్నం హైవే వంటి ప్రధాన రహదారులపై ఉదయం 8 గంటలు దాటినా పది అడుగుల దూరంలోని వాహనాలు కనిపించలేదు. సంగారెడ్డి జిల్లాలోని ముంబై జాతీయ రహదారిలోనూ పొగమంచు ప్రభావం తీవ్రంగా ఉంది.మరో వైపు పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్థులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ అహ్లాదకరమైన ఈ చల్లదనాన్ని మార్నింగ్ వాకర్స్ మాత్రం బాగా ఆస్వాదించారు. మరోవైపు శంషాబాద్ విమానాశ్రయంలోనూ పొగమంచు కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. ఢిల్లీ నుంచి శంషాబాద్‌కు, శంషాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం రద్దయింది. శంషాబాద్‌తిరుపతి, తిరుపతిశంషాబాద్ ఇండిగో విమానం కూడా ఆలస్యంగా నడుస్తోంది. ఇక అవసరమైతేనే రోడ్డు పైకి రావాలని, పొగ మంచు కారణాల వల్ల ముందు వెళ్తున్న వాహనాలు కనిపించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. వాహనాలు నడిపే వారు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో వేగంగా వెళ్లడం కన్నా జాగ్రత్తగా వెళ్లడం అత్యంత ముఖ్యమైన విషయమని స్పష్టం చేస్తున్నారు. నగర శివారైన శంషాబాద్ పరిధిలోని పాలమాకుల్, ఎయిర్‌పోర్టు, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, గండిపేట్ తదితర ప్రాంతాల్లో దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. రహదారులు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణిస్తున్నారు. బెంగళూరు జాతీయ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. మంచు నేపథ్యంలో వాహనాలు కదలిక నెమ్మదించింది.

# మన పొరుగింటోళ్లు మంచోళ్లు కారు: కేంద్ర మంత్రి వ్యాఖ్యలు



**ఈ కబురు డెస్క్ : ఉగ్రవాదం నుంచి తన ప్రజలను రక్షించుకొనే హక్కు భారత్‌కు ఉందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోసే కయ్యాలమారి మన పొరుగు దేశమని పేర్కొంటూ ఈ వ్యాఖ్య చేశారు. శుక్రవారం ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. అలాగే ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావిస్తూ.. "మనం ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఇతరులు నిర్ణయించలేరు" అని తేల్చి చెప్పారు. "మీ పొరుగువారు చెడ్డవారు ఉండొచ్చు. దురదృష్టవశాత్తూ మన దేశానికీ ఉన్నారు. వారు ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తుంటే.. ఆ ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు మనకుంది. మనం ఆ హక్కును వినియోగించుకుంటాం. దానిని ఎలా వాడతామనేది మన నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అంతేకానీ ఆ అంశంలో ఇతరులు ఎవరూ తల దూర్చలేరు. మనల్ని మనం రక్షించుకోవడానికి మనం చేయాల్సిందంతా చేస్తాం" అని జైశంకర్ వెల్లడించారు.**

మొదటి పేజీ తరువాయి

# ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ఫ్యూచర్ సిటీ



గుజరాత్ రాష్ట్రంలోని గిఫ్ట్ సిటీ ఇప్పటికే ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తుండగా, తెలంగాణలోనూ పోచారం లోని ఇన్ఫోసిస్ లో, ఐటీ కారిడార్ లోని ఒక గేటెడ్ కమ్యూనిటీ లో ఈ డి సి ఎస్ వ్యవస్థ ప్రస్తుతం పనిచేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం మరింత ఆధునికమైన డి సి ఎస్ ను భారత్ ఫ్యూచర్ సిటీకి పరిచయం చేయబోతుంది. ఈ విధానం భవిష్యత్తు నగరాలు, మాల్స్, టౌన్షిప్ లలో ఏసీలు లేకుండానే సమర్థవంతంగా చల్లదనాన్ని అందించే మార్గాలకు నాంది పలుకుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మోదీతో ట్రంప్‌నకు వ్యక్తిగత విభేదాలు.. అందుకే భారత్‌కు దూరం



ఈ కబురు డెస్క్: రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో అనుసరిస్తున్న విధానాలను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం తప్పుబట్టారు ట్రంప్ తన చర్యలతో భారత్ అమెరికాల మధ్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది ఇరుదేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. డెమోక్రటిక్ నేత సుబ్రమణ్యం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ట్రంప్ తన తొలివిడత పాలనలో తీసుకున్న చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత ప్రధాని మోదీతో సంబంధాలను బలోపేతం చేశారు. ఇప్పుడు మోదీతో ఆయనకు వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లుగా కన్పిస్తోంది. దానివల్ల చాలా ఏళ్లుగా బలంగా ఉన్న ఇరుదేశాల సంబంధాలను ఆయన చెడగొట్టుకుంటున్నారు. ఇది ఇరుదేశాలకు మంచిది కాదు' అని ఆయన అన్నారు. భారత్ తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అమెరికాకు చాలా ముఖ్యమని, ముఖ్యంగా చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి ఇది సాయపడుతుందన్నారు. ట్రంప్ విధించిన సుంకాలు ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయని సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌లో ఉభయపక్షాలు భారత్‌తో సంబంధాలకు కట్టుబడి ఉన్నాయన్నారు. ప్రస్తుతం అమెరికా విదేశాంగ విధానం దెబ్బతిందని.. ఇది తనను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. అన్నియుద్ధాలను ముగిస్తామంటూ ట్రంప్ అధికారంలోకి వచ్చారని.. కానీ దానికి పూర్తి విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# నేను ఆరోగ్యంగానే ఉన్నా: ట్రంప్



**ఈ కబురు, డెస్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాను ఆరోగ్యంగా, బలంగా ఉన్నానని ఒక ప్రసిద్ధ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గత అక్టోబరులో తాను వాల్టర్ రీడ్ జాతీయ సైనిక వైద్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు గుండెకు సీటీ స్కాన్ చేయించుకొని పొరపాటు చేశానని ఆయన వెల్లడించారు. ఆ పరీక్ష ప్రజల్లో తన ఆరోగ్యంపై అనుమానాలకు దారితీసిందన్నారు. గత నెలలో ట్రంప్ వ్యక్తిగత వైద్యుడు ఆయన ఆరోగ్య పరిస్థితిపై సమాచారం విడుదల చేశారు. ఎక్కువ వయసు కలిగిన వారు అనారోగ్య నిరోధక చర్యల్లో భాగంగా చేయించుకోవాల్సిన ఇమేజింగ్ (చిత్రం తీసే) పరీక్షల్ని ట్రంప్ చేయించుకున్నారని వైద్యుడు అన్నారు. తాను ఎంఆర్ఐ పరీక్ష చేయించుకున్నట్టు ట్రంప్ మొదట ప్రకటించారు. తన శరీరంలోని ఏ భాగంపై ఆ పరీక్ష జరిపారో తెలియదని అప్పట్లో ఆయన అన్నారు. హృద్రోగ సమస్యలేవీ లేవని రూఢి చేసుకునేందుకు సీటీ స్కాన్ లేదా ఎమ్ఆర్ఐ చేయించుకోవాలని తాను ట్రంప్‌నకు సలహా ఇచ్చినట్టు ఆయన వ్యక్తిగత వైద్యుడు నేవీ కెప్టెన్ సీన్ బార్బడెల్లా తాజాగా వెల్లడించారు. అధ్యక్షుని గుండెకు జరిపిన పరీక్షలో ఆయనకు ఎలాంటి అనారోగ్యమూ లేదని స్పష్టమైందని వెల్లడించారు.**

# గోపన్ పల్లిలో మద్యం మత్తులో దాడులు - పగిలిన తలలు

**అర్ధరాత్రి బెల్టుషాపు వద్ద చోటుచేసుకున్న వివాదం**

**ఇరు వర్గాలపై కేసులు నమోదు**

ఈకబురు, శేరిలింగంపల్లి : బెల్టు షాపులో బీరుకు పెంచిన 50 రూపాయల అధిక ధర గోపన్ పల్లిలో పెను వివాదానికి కారణమైంది. మద్యం మత్తులో బెల్ట్ షాపు వద్ద చోటు చేసుకున్న వివాదం పరస్పర దాడులకు వెళ్ళింది. ఈ దాడుల్లో పలువురికి తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో గోపనపల్లి తండాలో ఉన్న బెల్టు షాపుకు వెళ్లారు. బెల్ట్ షాపులో బీర్లు తీసుకోగా షాపు యజమాని ఒక్కో బీరుకు 50 రూపాయల అదనపు ధర చెప్పాడు. ఈ విషయమై షాపు యజమాని.. యువకుల మధ్య వివాదం జరిగింది. దీంతో సదరు షాపు యజమాని నానక్ రాంగూడలో ఉన్న తన కుమారులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకున్న యజమాని కుమారులు ఒక్కసారిగా యువకులపై దాడికి తెగబడ్డారు. పరస్పరం దాడులు చేసుకోవడంతో షాపు ధ్వంసం అయింది. ఈ దాడిలో నలుగురి తలలు పగిలి తీవ్ర గాయాలు కావడంతో వారిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.



బెల్ట్ షాపు ముందు స్థానికుల ఆందోళన



దాడిలో ధ్వంసమైన బెల్ట్ షాపు



దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

ఓవైపు ఈ దాడులపై చందానగర్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

గోపనపల్లిలో గురువారం రాత్రి ఓ రాజకీయ నాయకుడి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు హాజరైన కొంతమంది యువకులు

**గోపన్ పల్లిలో ఏరులై పారుతున్న మద్యం...**

కాగా అర్ధరాత్రి 2 గంటలకు మద్యం విషయమై చోటు చేసుకున్న ఈ వివాదం గోపనపల్లిలో ఏరులై పారుతున్న మద్యాన్ని కళ్లకు కట్టింది. గోపనపల్లి ప్రధాన రహదారి మీద ఉన్న ఓ వైన్ షాపు ప్రోత్సాహంతోనే గ్రామంలో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వైన్ షాపు నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించకుండా షాపు ముందు ఉన్న ప్రధాన రహదారి మీద సిట్టింగ్ ఏర్పాటు చేసి మద్యం సరఫరా చేస్తుంటారని స్థానికులు వాపోతున్నారు. వైన్ షాపు నిర్వాహకుల అండదండలతోనే గోపనపల్లిలో బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని అర్ధరాత్రి అయినా మద్యం దొరుకుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు.

**గోపన్ పల్లిలో ఉద్రిక్తత..**

కాగా అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ దాడులపై శుక్రవారం ఉదయం స్థానికులు బెల్ట్ షాపు ముందు ఆందోళన చేపట్టడం ఉద్రిక్తతకు దారి తీసింది. అప్పటికే షాపు యజమాని బెల్ట్ షాపును మూసివేసి అజ్ఞాతంలోకి వెళ్లగా, వందల మంది స్థానికులు బెల్టు షాపు వద్దకు చేరుకున్నారు. దీంతో చందానగర్ పోలీసులు షాపు వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. షాపు వెనక ఉన్న ఇంట్లో బెల్ట్ షాపు యజమాని మద్యం నిల్వ ఉంచాడని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చందానగర్ పోలీసులు స్థానికులతో కలిసి సదరు ఇంటికి వెళ్లి తాళం పగలగొట్టేందుకు ప్రయత్నించారు.

**ఇరువర్గాలపై కేసులు నమోదు..**

కాగా గోపనపల్లి వివాదంపై చందానగర్ పోలీసులు ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. యువకులపై దాడి చేసిన బెల్ట్ షాపు నిర్వాహకులు ప్రకాష్ సింగ్ తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. బెల్టు షాపుపై దాడి చేసి ధ్వంసం చేసిన ఘటనలో గోపన్ పల్లికి చెందిన సురేందర్ తో పాటు మరో 11 మందిపై కేసు నమోదు చేశారు.

# మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు...

**ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ - కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు, బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బీహెచ్ఈఎల్ టౌన్షిప్ లో గల శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తారానగర్ లో గల విద్యానికేతన్ హైస్కూల్ లో ఉపాధ్యాయిలకు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ తో కలిసి సాయిబాబా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు అని అన్నారు. ఈ పోటీలతో మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుందన్నారు. నేటి యువతరానికి మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ పోటీలలో ప్రిన్సిపాల్ కవిత, విజయలక్ష్మి, రమ్యలను విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కనకదుర్గ, వందన, శ్రీజ, ప్రజ్వల, శజ్యోతిర్మయి, స్కూల్ కరస్పాండెంట్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామస్వామి యాదవ్ తదితరులు

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం

ఈకబురు, శేరిలింగంపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా చాలా మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు.



**సంక్రాంతికి ఊరెళ్లే వారికి పోలీసుల సూచనలు...**

- సైబరాబాద్ కమీషనరేట్లో పోలీసులు ఇప్పటికే సీసీటీవీ లను ఇన్ స్టాల్ చేశారు. తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి.
- మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్లకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పడం మంచిది.
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు.
- ద్విచక్ర వాహనాలు, కార్లను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలపరాదు.
- బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు, తమతోపాటే తీసుకెళ్లాలి.
- ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి.
- మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, దినపత్రికలను & పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి, వాటిని గమనించి మీరు ఇంట్లో లేరనే విషయాన్ని దొంగలు గమనిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోండి.
- పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి.
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకపోవడం మంచిది.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి.
- ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం, లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి.
- ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం.
- మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్ లైన్లో ఎప్పటికప్పుడు చూసుకొంటూ వుండాలి. మీ ఇంటికి వచ్చే, వెళ్ళే దారులు మరియు ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చు కొని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో అమార్చండి.
- సొంత ఇల్లు అయినట్లయితే ఇంటి ప్రధాన ద్వారానికి గ్రిల్స్ అమర్చుకోవడం ద్వారా రెండంచెల భద్రతనిస్తుంది.
- ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసు స్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నెంబర్ దగ్గర ఉంచుకోవాలి. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం.
- అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టుపక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్ మెన్ ను నియమించుకోవాలి.
- కాలనీవాళ్లు కమిటీలు వేసుకొని వాచ్‌మెన్లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకకోవాలి.
- రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వచ్చినా వారి వివరాలు తెలుసుకుని రిజిస్టర్‌లో నమోదు చేసుకోవడం మంచిదని అపార్టుమెంట్ వాచ్‌మెన్‌లకు తెలపాలి.
- సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే వివరాలు ఇతరులకు షేర్ చేయడము మంచిది కాదు.
- **కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి. ఈ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 డయల్ లేదా సైబరాబాద్ పోలీసు వాట్సాప్ నెంబర్ 9490617444 కు సమాచారం ఇవ్వాలి.**

మొదటి పేజీ తరువాయి

# 'పుతిన్ ప్యాలెస్'.. ఈ నివాసం ఎప్పటికీ రహస్యమే..!



**ఈ కబురు, డెస్క్ :**

**రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన ఓ నివాసంపై ఇటీవల ఉక్రెయిన్ డ్రోన్ దాడికి యత్నించడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై మాస్కో చేస్తోన్న ఆరోపణలను కీవ్ ఖండించింది. ఈ పరిణామాలతో పుతిన్ వ్యక్తిగత భద్రత, ఆయన అధికారిక నివాసాలపై చర్చ మొదలైంది. రష్యా అధ్యక్షుడికి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నివాసాలు, ప్రైవేటు ఎస్టేట్‌లు ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. మరి వాటిల్లో ఏయే సౌకర్యాలు, ఎలాంటి భద్రత ఉందో తెలుసా..?**

**––ది క్రెమ్లిన్..**

ఇది మాస్కోలో ఉన్న రష్యా (Russia) అధ్యక్షుడి రాజ్యాంగబద్ధ అధికారిక భవనం. ఇక్కడే పుతిన్ వివిధ దేశాధినేతలకు ఆతిథ్యమిస్తారు. అనేక కీలక సమావేశాలకు ఇది వేదికగా ఉంటుంది. అయితే, చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే పుతిన్ ఇక్కడ ఒక రాత్రి మొత్తం బస చేస్తారని సమాచారం.

**––నోవో-ఒగర్యోవో..**

మాస్కోకు పశ్చిమాన ఉన్న ఒడింత్సోవ్‌స్కీ జిల్లాలో ఉందీ భవనం. ఇది శివారు ప్రాంతంలో అధ్యక్షుడికి అధికారికంగా కేటాయించిన నివాసం. పుతిన్ రోజువారీ పాలనా వ్యవహారాలు ఇక్కడినుంచే చూస్తారని అంచనా. అత్యున్నత స్థాయి సమావేశాలు, సీనియర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు వంటివి ఈ నివాసం నుంచే నిర్వహిస్తారట. ఈ సైట్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతతోపాటు నిఘా వ్యవస్థలు ఉంటాయి.

**––వల్డాయ్ ఎస్టేట్.. నోవ్‌గొరోడ్**

నోవ్‌గొరోడ్ గ్రామీణ ప్రాంతంలో వల్డాయ్ సరస్సును ఆనుకుని ఉన్న విలాసవంతమైన ప్యాలెస్ ఇది. ఇక్కడ నిరంతరం కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని సమాచారం. దీన్ని 'ఆబ్జెక్ట్ 201' అనే కోడ్ నేమ్‌తో పిలుస్తారు. మొత్తం 250 హెక్టార్లలో విస్తరించి ఉంటుంది. ఈ ఎస్టేట్ చుట్టూ అధునాతన గగనతల రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు శాటిలైట్ చిత్రాలతో వెల్లడైంది. ఇటీవల ఈ నివాసం పైనే ఉక్రెయిన్ డ్రోన్ దాడికి యత్నించినట్లు మాస్కో ఆరోపించింది. మొత్తం 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ఆ దేశం ప్రయోగించినట్లు రష్యా విదేశాంగ శాఖ మంత్రి లావ్రోవ్ తెలిపారు. అయితే అన్నింటినీ నిర్వీర్యం చేశామని, ఇంటికి ఎటువంటి నష్టం కలగలేదని ఆయన వెల్లడించారు. ఇందులో మొత్తం 80 భవనాలు ఉన్నాయి. ప్రధానమైన నాలుగంతస్తుల ప్యాలెస్‌ను 3,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. ఇందులో మినీ క్యాసినో, వీఐపీ రెస్టరంట్, సినిమా రూమ్, గోల్ఫ్ ఏరియా తదితర సదుపాయాలు ఉంటాయి.

**––బోచరోవ్ రుచేయ్..**

సోచిలోని క్రాస్నోడార్ క్రాయ్‌లో ఉండే ఈ నివాసాన్ని అధ్యక్షుడి వేసవి విడిదిగా పేర్కొంటారు. సాధారణంగా పుతిన్ ఇక్కడికి విశ్రాంతి తీసుకునేందుకు వస్తారని సమాచారం. అయితే, గత కొంతకాలంగా ఈ నివాసానికి డ్రోన్ ముప్పు ఉన్నట్లు నిఘా వర్గాల అంచనాలతో అధ్యక్షుడు ఇక్కడికి రావడం తగ్గించినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి.

**––ఈ నివాసాలు ఎప్పటికీ రహస్యమే..**

పైన చెప్పినవన్నీ అధికారిక నివాసాలే. అయితే, పుతిన్‌కు కొన్ని రహస్య ప్రాంతాల్లోనూ అనధికారిక భవనాలు ఉన్నట్లు సమాచారం. అందులో ఒకటి గెలెండ్‌జిక్‌లోని 'పుతిన్ ప్యాలెస్'. దీని గురించి 2021లో తొలిసారి బయటికొచ్చింది. నల్ల సముద్రతీరంలో ఉండే ఈ విశాల ప్రాంగణం చుట్టూ భారీ భద్రత ఉంటుందని సమాచారం. దీన్ని పుతిన్ తన వ్యక్తిగత అవసరాలు, షెల్ కంపెనీ నెట్‌వర్క్ కోసం వినియోగిస్తున్నట్లు గతంలో కొన్ని అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈ ప్యాలెస్ నిర్మాణం కోసం ఏకంగా ఒక బిలియన్ డాలర్లను ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. రష్యాలో అత్యంత ఖరీదైన ప్రైవేటు నివాసాల్లో ఇదొకటని దర్యాప్తు సంస్థలు తెలిపాయి. అయితే, ఇది పుతిన్ నివాసం కాదని క్రెమ్లిన్ పలుమార్లు వెల్లడించినప్పటికీ.. దీనిచుట్టూ ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ భద్రత ఉన్నట్లు పేర్కొన్నాయి. దీన్ని నోఫ్లై జోన్‌గానూ రష్యా ప్రభుత్వం ప్రకటించడం గమనార్హం.

ఇక, రష్యా ఆక్రమిత క్రిమియాలోని కేప్ అయాలో కూడా పుతిన్‌కు ఒక రహస్య లగ్జరీ ప్యాలెస్ ఉన్నట్లు రష్యా యాంటీ కరప్షన్ ఫౌండేషన్ అనే సంస్థ ఇటీవల గుర్తించింది. 127 మిలియన్ డాలర్లతో దీన్ని నిర్మించినట్లు తెలిపింది. ఇవేగాక, బంకర్లు, కాటేజ్‌లతో కూడిన ఓ రహస్య భద్రతా నెట్‌వర్క్ కూడా ఉందట. అత్యవసర సమయాల్లో పుతిన్‌ను తరలించేందుకు దట్టమైన అడవి మధ్యలో కాటేజ్‌లు, భూగర్భ బంకర్లు, సొరంగ మార్గాలను కూడా రష్యా నిర్మించినట్లు సమాచారం.

మొదటి పేజీ తరువాయి

# ఈవీఎంలకు జైకొట్టిన కర్ణాటక ప్రజలు.. రాహుల్‌పై భాజపా సెటైర్లు




ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీ పై భాజపా విమర్శలు గుప్పించింది.

2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ (కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ) గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ రిపోర్ట్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83.61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక, ఈ యంత్రాలు కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని 69.39 శాతం మంది అంగీకరించినట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని 91.31 శాతం విశ్వసించినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజవర్గాలకు చెందిన దాదాపు 5,100 మంది పాల్గొన్నారు. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు డివిజన్లలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు.

**––ఇది కాంగ్రెస్‌కు చెంపపెట్టు: భాజపా**

ఈ సర్వే ఫలితాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు ఆర్.అశోక్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈవీఎంలు నమ్మదగినవి కావని గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ ఒకే పాట పాడుతున్నారు. మన సంస్థలను ఆయన విశ్వసించడం లేదు. కానీ, ఆయన మాట తప్పని కర్ణాటక రుజువు చేసింది. ఎన్నికలను, ఈవీఎంలను, మన ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రజలు నమ్ముతున్నారు. ఈ సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలిసినా.. సిద్ధరామయ్య ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తామని ప్రకటించడం హాస్యాస్పదం. రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లాలనుకుంటున్నారు" అని భాజపా నేత మండిపడ్డారు.

## భారీ లాభాల్లో సూచీలు..

# ఆల్‌టైమ్ గరిష్ఠానికి నిఫ్టీ



**ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠాలను తాకింది.**

సెన్సెక్స్ ఉదయం 85,259.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,188.60) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,812.27 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 573.41 పాయింట్ల లాభంతో 85,762.01 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 26,340.00 వద్ద గరిష్ఠాన్ని తాకి.. చివరికి 182 పాయింట్ల లాభంతో 26,328.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 90 మార్కు దాటి 90.20కి చేరింది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.82 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4387 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## 90 రోజులు పనిచేస్తే గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత..


# కేంద్రం డ్రాఫ్ట్ రూల్స్



**గిగ్‌వర్కర్లకు సామాజిక భద్రత కల్పనకు సంబంధించి కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ ప్రయోజనాలు పొందాలంటే ఒక ఆర్థిక సంవత్సరంలో గిగ్‌వర్కర్లు ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు.. ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్ద 120 రోజులు పనిచేయాల్సి ఉంటుంది. మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత వంటి డిమాండ్లతో గిగ్ వర్కర్లు (gig workers) గత నెల రెండుసార్లు సమ్మెకు దిగిన వేళ కేంద్రం ఈ ముసాయిదా నిబంధనలు తీసుకురావడం గమనార్హం.**

ఒకరోజు అగ్రిగేటర్ వద్ద పనిచేస్తే.. వచ్చిన ఆదాయంతో సంబంధం లేకుండా దానిని ఒకరోజు కింద పరిగణనలోకి తీసుకుంటారు. ఒకవేళ ఒక గిగ్ వర్కర్ ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే.. దానిని మూడు రోజులుగా పరిగణిస్తారు. అలాగే నేరుగా లేక పరోక్షంగా అగ్రిగేటర్‌తో కలిసి పనిచేసే వారిని గిగ్ వర్కర్‌గా గుర్తిస్తామని కేంద్రం పేర్కొంది. అసంఘటిత కార్మికులకు జాతీయ డేటాబేస్‌గా పరిగణిస్తున్న ఇశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికే సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. కార్మికశాఖ ఇప్పటికే రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. ఇందులో నమోదు చేసుకున్నవారికి ఫొటోగ్రాఫ్, ఇతర వివరాలతో కూడిన ఐడీ కార్డు జారీ చేస్తారు. ఎప్పటికప్పుడు తమ వివరాలను ఇందులో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ముసాయిదాను డిసెంబర్ 30నే ప్రభుత్వం విడుదల చేసింది.ఇదిలాఉంటే.. డిసెంబర్ 25, 31 తేదీల్లో దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఆ తరుణంలోనే స్విగ్గీ (Swiggy), జొమాటో (zomato) ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాయి కూడా.

## ఆనంద్ మహీంద్రా న్యూ ఇయర్ సందేశం



**ఇంటెలిజెంట్ సిస్టమ్‌లు రొటీన్ పనులను నిర్వహించడం వల్ల ప్రాక్టికల్ నైపుణ్యాలకు మరింత ప్రాధాన్యం పెరుగుతుందని, ఉద్యోగులకు పంపిన నూతన సంవత్సర సందేశంలో ఆయన పేర్కొన్నారు. ఏఐ గురించి ఆందోళన చెందకుండా టెక్నీషియన్లు దానితో ధీమాగా కలిసి పని చేసే విధంగా మార్పులు వస్తాయని వివరించారు. దీన్ని తాము ఆచరణలో అమలు చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ పరమైన పరిణామాలతో బ్లూకాలర్ ఉద్యోగాలు కాస్తా ఆకర్షణీయమైన గోల్డ్ కాలర్ ఉద్యోగాలుగా మారతాయని తెలిపారు.మారుతున్న టెక్నాలజీ, భౌగోళిక - రాజకీయపరమైన పరిణామాలతో నూతన సంవత్సరంలో సర్వత్రా అనిశ్చితి నెలకొనవచ్చని మహీంద్రా చెప్పారు. అయితే అనిశ్చితిని శత్రువుగా పరిగణించకుండా, మన సత్తా నిరూపించుకునే అవకాశంగా భావించాలని సూచించారు. 2025లో ఎస్‌యూవీలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు, మహీంద్రా ఫైనాన్స్ తదితర వ్యాపార విభాగాల్లో గ్రూప్ గణనీయ విజయాలు సాధించిందని ఆనంద్ మహీంద్రా చెప్పారు.**

# ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ప్లాంటులో వాణిజ్య ఉత్పత్తి



హైదరాబాద్‌లో నెలకొల్పిన తమ విద్యుత్తు బస్సుల ప్లాంటులో, వాణిజ్య ఉత్పత్తికి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ శ్రీకారం చుట్టింది. ఈ ప్లాంటులో తొలిదశ ఉత్పత్తి ప్రారంభించామని, ఫలితంగా తమ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2,500 బస్సులకు చేరినట్లు సంస్థ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. విద్యుత్తు వాహన రంగంలో మరింత ముందుకు వెళ్లేందుకు, ఈ పరిణామం ఉపకరిస్తుందని సంస్థ తెలిపింది. హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్‌లో విద్యుత్తు బస్సుల ప్లాంటును ఎంఈఐఎల్ గ్రూప్ సంస్థ అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ నిర్మించింది. 150 ఎకరాల విస్తీర్ణంలో రూపొందించిన ఈ ప్లాంటులో, దశలవారీగా ఉత్పత్తి చేపడతామని సంస్థ గతంలోనే ప్రకటించింది. 2025 డిసెంబరు 31న తొలిదశ ఉత్పత్తి కార్యకలాపాలకు శ్రీకారం చుట్టినట్లు తాజాగా వెల్లడించింది.

## మార్కెట్‌లోకి కొత్త కియా సెల్టోస్..

# ధర ₹10.99 లక్షల నుంచి ప్రారంభం



ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా తన రెండో జనరేషన్ సెల్టోస్‌ను (Kia Seltos) దేశీయ మార్కెట్‌లో విడుదల చేసింది. గట్టి పోటీ ఉన్న మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో అత్యాధునిక హంగులతో 2026 మోడల్ సెల్టోస్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధరను రూ.10.99 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. గరిష్ఠ ధరను రూ.19.99 లక్షలు (ఎక్స్ షోరూమ్)గా పేర్కొంది. జనవరి రెండో వారం తర్వాత నుంచి వీటి డెలివరీలు ప్రారంభమవుతాయని వెల్లడించింది. రూ.25వేల టోకెన్ అమౌంట్‌తో డిసెంబర్ 11 నుంచి బుకింగ్స్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

**ధర వివరాలు..**

కియా సెల్టోస్ HTE, HTK, HTX, GTX, XLine వంటి ఐదు ట్రిమ్స్‌లో లభిస్తుంది. ఇందులో హెచ్‌టీఈ బేస్ మోడల్ కాగా.. జీటీఎక్స్ అనేది టాప్ ఎండ్ మోడల్. ఈ కారు 1.5 లీటర్ నేచరల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ (115 హెచ్‌పీ, 144 Nm), 1.5లీటర్ టర్బోపెట్రోల్ (160 హెచ్‌పీ, 253 Nm), 1.5లీటర్ డీజిల్ (116 హెచ్‌పీ, 250 Nm) ఇంజిన్ ఆప్షన్లతో వస్తోంది. ఎంటీ, ఐవీటీ, డీసీటీ, ఏటీ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లు ఉన్నాయి. వేరియంట్‌ను బట్టి ధరలను పట్టికలో గమనించొచ్చు.

కొత్త కియా సెల్టోస్ డిజైన్ విషయానికొస్తే.. గ్లోబల్ మోడల్ నుంచి పొందిన స్ఫూర్తితో టైగర్ నోజ్ గ్రిల్‌తో తీసుకొచ్చారు. దీనికి వర్టికల్ లైటింగ్ ఎలిమెంట్లు జోడించారు. ఈ ఎస్‌యూవీలో 18 అంగుళాల అలాయ్ వీల్స్ ఇచ్చారు. కనెక్టెడ్ టైల్ లైట్లతో కూడిన అప్‌డేటెడ్ టైల్‌గేట్‌ను ఇచ్చారు. పనోరమిక్ సన్‌రూఫ్, ఇంటిగ్రేటెడ్ రియర్ స్పాయిలర్, షార్క్ ఫిన్ యాంటెన్నా వంటివి ఉన్నాయి. మొత్తం 10 బాడీ పెయింట్ ఆప్షన్లతో తీసుకొచ్చారు. ఇందులో మార్నింగ్ హేజ్, మాగ్మా రెడ్ కొత్తవి.

ఈ సెగ్మెంట్‌లో అత్యంత పొడవైన కారు (4,460 మి.మీ.) ఇదేనని కంపెనీ తెలిపింది. 1,830 మి.మీ. వెడల్పు, 1,635 మి.మీ. ఎత్తు, 2,690 మి.మీ. వీల్‌బేస్‌తో వస్తోంది. గతంతో పోలిస్తే వీల్‌బేస్ 80 మిల్లీమీటర్లు పెరిగింది. వీల్‌బేస్ పెరగడం వల్ల లెగ్‌రూమ్ కూడా ఆ మేర పెరిగింది. కారు లోపల 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 12.3 అంగుళాల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ సింగిల్ ప్యానెల్ విజువల్ కమాండ్ సెంటర్ ఉన్నాయి. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, 64 కలర్ యాంబియెంట్ మూడ్ లైటింగ్, డీ కట్ డ్యూయల్ టోన్ లెదర్ స్టీరింగ్ వీల్‌ను ఇచ్చారు.

**6 ఎయిర్‌బ్యాగులు, ఈఎస్‌పీ, హిల్ స్టార్ట్ అసిస్ట్, అన్ని వీల్స్‌కు డిస్కు బ్రేకులు, 360-డిగ్రీల కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, OTA అప్‌డేట్లతో కూడిన రిమోట్ కంట్రోల్ వంటివి ఉన్నాయి. లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్, నావిగేషన్ బేస్డ్ స్మార్ట్ క్రూజ్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి. స్నో, మడ్, సాండ్ మోడల్‌లు ఉన్నాయి. టాటా సియారా, హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా,**

# స్కోరు 750 దాటాలంటే




క్యాలెండర్ మారింది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఆరోగ్యం, వృత్తి పరంగా ఎన్నో లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. వీటన్నింటికీ ఇంధనం లాంటిది ఆర్థికారోగ్యం. భవిష్యత్తులో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్నా, పిల్లల ఉన్నత చదువులకు, విదేశాలకు పంపాలన్నా, అత్యవసరాల్లో ఆదుకోవాలన్నా బ్యాంకుల నుంచి రుణం తీసుకోవడం ముఖ్యం. బ్యాంకులు మనకు రుణం ఇవ్వాలంటే, ముందుగా చూసేది మన సంపద లెక్కలు కాదు.. మన క్రెడిట్ స్కోరు.

గతంలో కేవలం రుణం ఇచ్చేందుకు మాత్రమే స్కోరును చూసేవారు. కానీ, ఇప్పుడు వడ్డీ రేటును నిర్ణయించడంలోనూ క్రెడిట్ స్కోరుదే కీలక పాత్ర. 750 కంటే ఎక్కువ స్కోరున్న వారికి ఒక వడ్డీ రేటు.. అంతకంటే తక్కువ ఉన్న వారికి మరో రేటు ఉంటోంది. కాబట్టి, కొత్త ఏడాదిలో మీ స్కోరు గరిష్ఠంగా ఉంచుకునేందుకు పాటించాల్సిన ప్రణాళికలేమిటో చూద్దాం..

చెల్లింపుల చరిత్ర

క్రెడిట్ స్కోరును నిర్ణయించడంలో సుమారు 35 శాతం వరకూ మీ చెల్లింపుల చరిత్రదే ఉంటుంది. మీరు గతంలో తీసుకున్న రుణాలను ఎంత సక్రమంగా తీరుస్తున్నారన్నదే ఇక్కడ కీలకం.

గడువు తేదీ దాటిన తర్వాత చెల్లిస్తే.. బ్యాంకు జరిమానా వేయడమే కాదు.. ఆ విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు నివేదిస్తుంది. ఇది, మీ రికార్డులో 24 నెలలపాటు అలాగే ఉండిపోతుంది.

పని ఒత్తిడిలో తేదీలు మర్చిపోవడం సహజం. అందుకే, మీ లోన్ ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లుల కోసం బ్యాంకు ఖాతాలో ఆటో డెబిట్ పెట్టుకోవడం ఉత్తమం. ఇది మిమ్మల్ని డిఫాల్టర్ కాకుండా కాపాడుతుంది.

క్రెడిట్ కార్డు బిల్లులో మొత్తం బాకీ కాకుండా.. కనీస మొత్తం చెల్లించి, ఊపిరి పీల్చుకుంటే పొరపాటే. దీనివల్ల అసలు అప్పు తగ్గదు సరికదా.. వడ్డీల మీద వడ్డీలు పడి అప్పుల ఊబిలో కూరుకుపోతారు. ఇది స్కోరును దారుణంగా దెబ్బతీస్తుంది.

వినియోగంపై కన్నేయండి

మీకు రూ.5లక్షల క్రెడిట్ పరిమితి ఉన్న కార్డు ఉందనుకుందాం. అంత మొత్తం ఉంది కదా అని ప్రతి నెలా రూ.4లక్షల వరకూ వాడేస్తున్నారా? ప్రమాదంలో ఉన్నట్లే.

మీకు మంజూరైన క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వాడొద్దు. పరిమితికి మించి వాడితే మీరు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని నిత్యం, అప్పుల మీద ఆధారపడుతున్నారని బ్యాంకులు భావిస్తాయి. ఇది స్కోరు తగ్గేందుకు కారణమవుతుంది. ఖర్చులు ఎక్కువగా ఉంటే, ఒకే కార్డును కాకుండా, రెండు మూడు కార్డులకు విభజించండి. లేదా కార్డుల క్రెడిట్ పరిమితిని పెంచుకునేందుకు ప్రయత్నించండి.

వైవిధ్యంగా..

మీ రుణ పోర్ట్‌ఫోలియోలో కేవలం క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు మాత్రమే ఉంటే స్కోరు పెరగడం కొంచెం కష్టం.

హామీ లేని రుణాలతో పాటు, గృహరుణం, వాహన రుణాల్లాంటివీ ఉండాలి. వివిధ రకాల రుణాలను మీరు సమర్థంగా నిర్వహించగలరని ఇది రుజువు చేస్తుంది. వైవిధ్యం కోసం కొత్త రుణాలను తీసుకోవడం మంచిది కాదు.

పాత కార్డులతో

కొంతమంది ఎన్నో ఏళ్లుగా ఉపయోగిస్తున్న క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటారు. ఇది కొన్నిసార్లు స్కోరును తగ్గిస్తుంది. మీ క్రెడిట్ చరిత్ర ఎంత సుదీర్ఘంగా ఉంటే, బ్యాంకర్లకు మీపై అంత నమ్మకం పెరుగుతుంది. పాత క్రెడిట్ కార్డును కొనసాగించడం వల్ల మీ సగటు రుణ కాల పరిమితి పెరుగుతుంది. ఇది స్కోరుకు సానుకూల అంశం. ఒకవేళ ఆ కార్డుకు వార్షిక రుసుము ఉంటే, దాన్ని జీవిత కాల ఉచిత కార్డుగా మార్చుకునే ప్రయత్నం చేయండి. కానీ, రద్దు చేసుకోవద్దు.

తరచూ దరఖాస్తులు వద్దు

రుణం అవసరం లేకపోయినా, ఆఫర్లు వస్తున్నాయని ఆన్‌లైన్‌లో ప్రతిదానికీ దరఖాస్తు చేయొద్దు. మీరు రుణం కోసం ప్రయత్నించిన ప్రతిసారీ బ్యాంకు మీ క్రెడిట్ రికార్డును తనిఖీ చేస్తుంది. దీన్నే 'హార్డ్ ఎంక్వైరీ' అంటారు. తక్కువ సమయంలో ఎక్కువ పరిశీలనలు జరిగితే.. మీ స్కోరు తగ్గుతుంది. మీ అంతట మీరే ఆన్‌లైన్‌లో క్రెడిట్ స్కోరును పరిశీలించుకోవడం వల్ల స్కోరు తగ్గదు. కానీ, బ్యాంకులు చూస్తే తగ్గుతుంది.

తప్పులుంటే

సాంకేతిక కారణాల వల్ల లేదా బ్యాంకు సిబ్బంది పొరపాట్ల వల్ల మీ క్రెడిట్ నివేదికలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. కనీసం ఆరు నెలలకోసారైనా మీ పూర్తి క్రెడిట్ నివేదికను డౌన్‌లోడ్ చేసుకొని చూడండి. మీ పేరు, పాన్ నంబరు, చిరునామా సరిగ్గా ఉన్నాయా, ముందే తీర్చేసిన రుణాలు ఇంకా 'యాక్టివ్'గా చూపిస్తున్నాయా గమనించండి. ఏమైనా పొరపాట్లు ఉంటే సంబంధిత క్రెడిట్ బ్యూరోల ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలి. సాధారణంగా 30 రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

క్రెడిట్ స్కోరు రాత్రికి రాత్రే పెరగదు. పైన చెప్పిన సూత్రాలను కనీసం 612 నెలల పాటు కచ్చితంగా పాటిస్తే.. 2026 ముగిసే నాటికి మీ స్కోరు కచ్చితంగా 750800 మధ్య ఉంటుంది.

# టైగర్ సరసన కృతి శెట్టి?



అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. “ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బడ్జెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ”ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’, ‘వా వాతియార్’ విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

# ఊహించని మలుపులతో.. ది బ్లాక్ గోల్డ్

‘ది బ్లాక్ గోల్డ్’ సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ‘‘ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణే మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం’’ అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.



# అడ్వాన్స్ బుకింగ్స్‌లో విజయ్ ‘జన నాయగన్’ దూకుడు..



హైదరాబాద్: విజయ్ (Vijay) కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ‘జన నాయగన్’. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే తమిళ వెర్షన్‌కు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. వీటిద్వారా ఇప్పటివరకూ రూ.15 కోట్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. విజయ్ నటిస్తున్న చివరి సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి.

తెలుగులో విజయవంతమైన ‘భగవంత్ కేసరి’కి రీమేక్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారని ఎప్పటినుంచో ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఈ క్రమంలో దర్శకుడు హెచ్.వినోద్ స్పందించారు. ‘నేను ఈ విషయాన్ని ధ్రువీకరించను. అలాగే కొట్టిపారేయను. ఇంతకుముందు కూడా మీకు ఈ విషయం చెప్పాను. ఇది దళపతి మూవీ. ఇది రీమేకా..? ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తిపొంది తీశారా? అన్న విషయంపై ప్రేక్షకులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు. వచ్చి సినిమా చూడండి’ అని అన్నారు. జనవరి 3న ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అది వస్తే చాలా విషయాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# జడల్ జమానా ఇది



‘దసరా’ విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహు భాషా చిత్రం ‘ది ప్యారడైజ్’. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందర్భంగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. ‘‘జడల్ జమానా’’ అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# వేసవిలో సాయిపల్లవి మేరే రహో

అందం, అభినయం.. సహజమైన నటనతో ప్రేక్షకుల్ని ఫిదా చేస్తుంటుంది అందాల తార సాయి పల్లవి. గత ఏడాది బుజ్జితల్లిగా ‘తండేల్’ చిత్రంలో నటించి అందర్నీ అలరించింది. ప్రస్తుతం ‘మేరే రహో’, ‘రామాయణ’ చిత్రాలతో బిజీగా ఉంది. ఈ ఏడాది కూడా మంచి విజయాలు తన ఖాతాలో వేసుకోవడానికి సిద్ధంగా ఉందామె. ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్‌తో కలిసి నటిస్తోన్న ‘మేరే రహో’కి సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా దీన్ని ఈ ఏడాది వేసవిలో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ‘‘ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ ప్రేమకథా చిత్రం కొన్ని భారీ సినిమాల విడుదల కారణంగా ఆలస్యమయ్యింది. ఇప్పుడీ రొమాంటిక్ డ్రామాను ఆమిర్ జులైలో థియేటర్లలోకి తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. తొలిసారి తెరపై కనిపించబోతున్న సాయి పల్లవి, జునైద్‌ల జోడీ ఆకర్షణీయంగా కనిపిస్తుంద’’ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# మన శంకర వరప్రసాద్ గారు’ ట్రైలర్ ఫిక్స్.. రూల్స్ బ్రేక్ చేసిన నయనతార

మెగా అభిమానులారా..! సంబరాలకు సిద్ధంకండి. ఎందుకంటే ఇప్పటివరకూ మీరు చూడని సరికొత్త చిరంజీవిని (Chiranjeevi) చూడబోతున్నారు. అందులో తనది గ్యారెంటీ అని బల్లగుద్ది మరీ చెబుతున్నారు అనిల్ రావిపూడి. వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘మన శంకర వరప్రసాద్‌గారు’ (Mana Shankara Vara Prasad Garu). నయనతార (Nayanthara) కథానాయిక. వెంకటేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న (mana shankara varaprasad garu release date) వినోదాన్ని పంచడానికి సిద్ధమవుతున్న ఈ మూవీకి సంబంధించి ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. తాజాగా ట్రైలర్ విడుదల తేదీని చిత్ర బృందం ప్రకటించింది. జనవరి 4న దీనిని విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో చిరు ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించారు. మోకాలిపై కూర్చొని తుపాకీ పేలుస్తున్న స్టిల్స్ అభిమానులతో విజిల్స్ వేయించేలా ఉంది. ఇక ఆ యాక్షన్ ఎపిసోడ్‌కు థియేటర్ దద్దరిల్లాల్సిందే.

రూల్స్ బ్రేక్ చేసిన నయన్..

అగ్ర కథానాయిక నయనతార గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రొఫెషన్ విషయంలో ఆమె రూల్ అంటే రూలే. ఏ సినిమా ఒప్పుకొన్నా, ప్రచారానికి తాను రానని ముందే చెబుతారని టాక్. గత కొంతకాలంగా ఆమె నటించిన సినిమాలు చూస్తే, ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. చాలా అరుదుగా భర్త విఘ్నేశ్ కోసం ఒకట్రెండు సార్లు వచ్చారు. తాను హీరోయిన్‌గా చేసిన చాలా సినిమాలకు రాలేదు. ఇప్పుడు ‘మన శంకర వరప్రసాద్ గారు’ కోసం ఆ రూల్‌ని బ్రేక్ చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆమే స్వయంగా వచ్చి మూవీ ప్రమోషన్స్ గురించి దర్శకుడు అనిల్ రావిపూడిని అడగటం.. ఆయన కళ్లు తిరిగి పడిపోవడం నవ్వులు పూయిస్తోంది. ‘సంక్రాంతికి వస్తున్నాం’ మూవీకి వెంకటేశ్‌తోనే రీల్స్ చేయించిన అనిల్.. నయనతారకు ఏం చెప్పి ఒప్పించారో తెలియదు. అనిల్ దగ్గర ఏదో మంత్రదండం ఉందంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు సరికొత్తగా ప్రచారం చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం వెంకటేశ్ అమెరికాలో ఉన్నారు. ఆయన రాగానే, మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన తేదీని కూడా ప్రకటిస్తారు.






# 2027 ప్రపంచకప్ తర్వాత వన్డేల మనుగడ కష్టమే




చెన్నై: వన్డే ప్రపంచకప్ (2027) తర్వాత వన్డే క్రికెట్ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని మాజీ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. టీ20 లీగ్‌ల విస్తరణ తర్వాత వన్డేల ప్రాధాన్యం బాగా తగ్గిపోయిందని చెప్పాడు. "2027 వన్డే ప్రపంచకప్ తర్వాత వన్డే క్రికెట్ భవిష్యత్తు ప్రశ్నార్థకమే. నాకు కాస్త ఆందోళనగా ఉంది కూడా. విజయ్ హజారే ట్రోఫీ చూస్తున్నా. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చూశాక దీన్ని చూడడం కష్టంగానే ఉంది'' అని తన హిందీ యూట్యూబ్ ఛానెల్‌లో అశ్విన్ చెప్పాడు. "ప్రేక్షకులు ఏం చూడాలనుకుంటున్నారో మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. టెస్టు క్రికెట్‌కు ఇప్పటికీ తన కంటూ ఓ స్థానం ఉంది. కానీ వన్డే క్రికెట్‌కు అలాంటి స్థానం లేదనిపిస్తోంది. విరాట్, రోహిత్ రావడంతో జనం విజయ్ హజారే చూడడం మొదలుపెట్టారు. వ్యక్తుల కంటే ఆట పెద్దదని మనకు తెలుసు. కానీ ఆటకు ప్రాధాన్యత పెంచడానికి కొన్నిసార్లు పెద్ద ఆటగాళ్లు (రోకో) తిరిగి రావాలి'' అని అశ్విన్ చెప్పాడు. 'విజయ్ హజారే ట్రోఫీ ప్రేక్షకులు పెద్దగా చూడని దేశవాళీ టోర్నీ అన్నది నిజమే. కానీ కోహ్లి, రోహిత్ వల్ల చూశారు. వాళ్లు వన్డేలు ఆడడం మానేస్తే పరిస్థితేంటి?'' అని అన్నాడు. "వన్డే క్రికెట్ ఒకప్పుడు గొప్ప ఫార్మాట్. 1015 ఓవర్లు సింగిల్స్ తీసి ఆ తర్వాత చెలరేగిపోయే ధోని లాంటి ఆటగాణ్ని ఇచ్చింది. ధోని లాంటి ఆటగాళ్లు మళ్లీ రారు. ఇప్పుడు అలా ఆడాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ఇప్పుడు రెండు కొత్త బంతులు, వలయం లోపల అయిదుగురు ఫీల్డర్లతో మ్యాచ్‌లు జరుగుతున్నాయి' అని అశ్విన్ చెప్పాడు. వచ్చే టీ20 ప్రపంచకప్‌లో భారత్ × అమెరికా, భారత్ × నమీబియా వంటి మ్యాచ్‌లకు ప్రేక్షకులు ఆకర్షితులు కారని చెప్పాడు.

**--వన్డే క్రికెట్ బతకాలంటే..**

మరీ ఎక్కువ ఫార్మాట్లు, ఎక్కువ ప్రపంచకప్‌లు ఉండడం వల్ల ఆటపై ఆసక్తి తగ్గుతోందని అశ్విన్ అన్నాడు. ప్రతి ఏటా ఏదో ఒక ఐసీసీ టోర్నీ ఉంటోందని, తాను ప్రపంచకకప్‌లు నిర్వహిస్తున్న తీరుపై ఐసీసీ ఆలోచించాలని చెప్పాడు. వన్డే క్రికెట్ బతకాలంటే ప్రతి నాలుగేళ్లకోసారి వన్డే ప్రపంచకప్ మాత్రమే జరగాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "వన్డే క్రికెట్‌కు మళ్లీ విలువ రావాలంటే టీ20ల్లో లీగ్స్ ఆడాలి. నాలుగేళ్లకోసారి వన్డే ప్రపంచకప్ నిర్వహించాలి. అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వన్డే క్రికెట్ నెమ్మదిగా చచ్చిపోతుందని అనిపిస్తోంది'' అని అన్నాడు.

# విరాట్ కోహ్లీని 2026లో ఊరిస్తున్న మూడు రికార్డులు ఇవే..!




టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీని 2026 సంవత్సరంలో మూడు రికార్డ్‌లు ఊరిస్తున్నాయి. అతడు దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఇలా 2025ను ఘనంగా ముగించాడు. కొత్త ఏడాదిలో అతడు మూడు మైలురాళ్లను అధిగమించే అవకాశముంది.

--మరో 339 పరుగులు చేస్తే..

విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో మరో 339 పరుగులు చేస్తే.. ఈ లీగ్‌లో 9,000 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా నిలుస్తాడు. ప్రస్తుతం అతడు 259 ఇన్నింగ్స్‌ల్లో 8,681 పరుగులు చేసి, ఐపీఎల్‌లో టాప్‌స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. అతడి తర్వాత 267 ఇన్నింగ్స్‌ల్లో 7,046 రన్స్‌తో రోహిత్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ తన ఐపీఎల్ కెరీర్‌లో మొదటినుంచి ఇప్పటివరకు కేవలం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే.

--ఇంకా 443 పరుగులు సాధిస్తే..

విరాట్ కోహ్లీ వన్డేల్లో మరో 443 పరుగులు చేస్తే 15,000 మైలురాయిని చేరుకుంటాడు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం 296 ఇన్నింగ్స్‌ల్లో 14,557 పరుగులు చేశాడు. ఈ జాబితాలో సచిన్ తెందుల్కర్ అగ్ర స్థానంలో ఉన్నాడు. అతడు 452 ఇన్నింగ్స్‌ల్లో 18,426 పరుగులు చేశాడు. ఇప్పటివరకు సచిన్ ఒక్కడే వన్డేల్లో 15,000కు పైగా పరుగులు చేశాడు.

--మరో 42 రన్స్ కొడితే..

న్యూజిలాండ్, టీమ్ఇండియాల మధ్య జనవరి 11న తొలి వన్డే ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఓ రికార్డ్ సృష్టించే అవకాశముంది. ప్రస్తుతం అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 623 ఇన్నింగ్స్‌ల్లో 27,975 పరుగులు చేశాడు. మరో 42 పరుగులు చేస్తే.. ఈ విషయంలో శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కరను (28,016 పరుగులు) అధిగమిస్తాడు. అప్పుడు కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా రికార్డ్ సృష్టిస్తాడు.

# రోహిత్, విరాట్ కోసం బీసీసీఐ మరిన్ని వన్డేలు నిర్వహించాలి: ఇర్ఫాన్ పఠాన్




భారత సీనియర్ ప్లేయర్లు.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఏడాది పొడవునా ఆటలో కొనసాగడానికి, బీసీసీఐ మరిన్ని వన్డేలను షెడ్యూలు చేయాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. భారత జట్టు 2026లో తన తొలి వన్డేను జనవరి 11న న్యూజిలాండ్‌తో ఆడనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే.. టీ20, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారు కేవలం వన్డే క్రికెట్‌లోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ అయిదు వన్డే మ్యాచ్‌ల సిరీస్‌లు, త్రైపాక్షిక సిరీస్‌లు ఎందుకు నిర్వహించడం లేదని ఇర్ఫాన్ పఠాన్ ప్రశ్నించాడు. 2027 వన్డే వరల్‌డ్‌కప్ వరకు రోహిత్, విరాట్‌కు తగినంత క్రికెట్ ఆడే అవకాశం కల్పించాలని సూచించాడు. 'మనం మూడు వన్డేల సిరీస్‌ల బదులు అయిదు వన్డేల సిరీస్‌లు ఎందుకు ఆడకూడదు. ఎందుకు త్రైపాక్షిక సిరీస్‌లు నిర్వహించడం లేదు. మంచి విషయం ఏంటంటే.. ఇప్పటికీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శనలు చేస్తున్నారు. వరల్డ్ కప్ నేపథ్యంలో వారికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ కల్పించాలి. ఒకవేళ అంతర్జాతీయ మ్యాచ్‌లు లేకపోతే వారు దేశవాళీ క్రికెట్‌లోనైనా వరుసగా మ్యాచ్‌లు ఆడాలి' అని ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. 2025లో లీడింగ్ రన్ స్కోరర్స్‌గా నిలిచారు. విరాట్ 13 ఇన్నింగ్స్‌ల్లో 65.10 యావరేజ్‌తో 651 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలున్నాయి. రోహిత్ శర్మ 14 ఇన్నింగ్స్‌ల్లో 50 యావరేజ్‌తో 650 రన్స్ సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలోనూ వీరు రాణించారు. దిల్లీ తరఫున కోహ్లీ ఒక సెంచరీ (131), ఒక హాఫ్ సెంచరీ (77), ముంబయి తరఫున రోహిత్ ఒక సెంచరీ (155*) సాధించారు. టీమ్ఇండియా అయిదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను చివరిసారిగా 2019లో ఆస్ట్రేలియాతో ఆడింది. అప్పటి నుంచి కేవలం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లు మాత్రమే భారత జట్టు ఆడుతోంది. అలాగే చివరిసారిగా త్రైపాక్షిక సిరీస్‌లో 2015లో పాల్గొంది. ఆ సిరీస్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, భారత్ ఆడాయి. ఆ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరిగాయి.

# అక్కడి పిచ్‌లు మాత్రం భేష్.. భారత్‌లో అలా జరిగితేనేమో గగ్గోలు!



భారత్‌లో ఎప్పుడైనా టెస్టు మ్యాచ్‌లో పిచ్‌లు స్పిన్నర్లకు బాగా అనుకూలిస్తే.. మ్యాచ్ రెండు మూడు రోజుల్లో ముగిసిపోతే ఇక అంతే సంగతులు! ప్రపంచ క్రికెట్ ప్రమాదంలో పడ్డట్లు నానా యాగీ చేస్తారు విదేశీ జట్ల మాజీ క్రికెటర్లు, మీడియా ప్రతినిధులు. ఇవేం పిచ్‌లని.. మ్యాచ్‌లను ఇలా ఏకపక్షం చేయడమేంటని టీమ్ఇండియాను తప్పుబట్టే ప్రయత్నం చేస్తుంటారు. కానీ విదేశాల్లో పేస్ వికెట్లు కూడా అంతే అనూహ్యంగా స్పందిస్తే.. మ్యాచ్‌లు త్వరగా ముగిసిపోతే మాత్రం గప్‌చుప్!

**--తమ జట్టు గెలిచినా సరే..**

యాషెస్ సిరీస్‌లో భాగంగా.. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమిచ్చిన నాలుగో టెస్టులో రెండు రోజులు కూడా పూర్తిగా ఆట సాగలేదు. సిరీస్‌లో అప్పటికే 03తో వెనుకబడ్డ ఇంగ్లాండ్.. ఈ మ్యాచ్‌లో గెలిచి ఊరట పొందింది. తమ జట్టు గెలిచినా సరే.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్.. పిచ్ స్పందించిన తీరుపై అసహనం వ్యక్తం చేశాడు. ఏ పిచ్ ఇస్తే దానిపై ఆడడమే తమ పని అంటూనే.. మరీ ఇలా రెండు రోజులకే మ్యాచ్ ముగిసిపోతే ఎలా అన్నాడు. బాక్సింగ్ డే టెస్టు చూడాలని ఎంతో ఆసక్తితో అయిదు రోజులకు టికెట్లు కొన్నవారి పరిస్థితేంటని ప్రశ్నించాడు. ఆస్ట్రేలియా కాకుండా మరో చోట పిచ్ ఇలా స్పందిస్తే ఎలా ఉండేదో అంటూ ఆశ్చర్యపోయాడు.

**--పెర్త్‌లోనూ.. రెండు రోజుల్లోనే..**

ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ అయితే.. భారత్‌లో పిచ్ ఇలా ఉంటే గగ్గోలు పెట్టేవారని.. ఆస్ట్రేలియాలో వికెట్ ఇలా స్పందించడం గురించి కూడా చర్చ జరగాలని అన్నాడు. ప్రస్తుత యాషెస్‌లో ఒక టెస్టు రెండు రోజుల్లోనే ముగిసిపోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం.. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టు కూడా రెండో రోజే పూర్తయింది. అందులో ఆస్ట్రేలియా గెలిచింది. యాషెస్‌లో ఇప్పటి దాకా జరిగిన నాలుగు టెస్టులు కలిపి 13 రోజుల్లోనే పూర్తయిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అయినా పిచ్‌ల మీద ఎలాంటి ప్రశ్నలు, విమర్శలు రాకపోవడంపై భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

**--భారత పిచ్‌లపై అక్కసు!**

భారత్‌లో పిచ్‌లు స్పిన్నర్లకు బాగా సహకరించి, విదేశీ బ్యాటర్లు తడబడినప్పుడల్లా ఇక్కడి వికెట్ల నాణ్యత గురించి అటు వైపు నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. పిచ్‌ల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం, పర్యటక జట్లు ఐసీసీకి (ICC) ఫిర్యాదులు చేయడం జరుగుతుంటుంది. ఐసీసీ నుంచి హెచ్చరికలు రావడం, పిచ్‌లకు అయోగ్యత పాయింట్లు ఇవ్వడం కూడా మామూలే. ఇటీవల దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు మూడో రోజే ముగిసిపోయింది. ఆ మ్యాచ్‌లో బౌలర్లు విజృంభించారు. ఆ మ్యాచ్‌లో 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక భారత్ 93 పరుగులకే ఆలౌటైంది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా గెలిచింది కాబట్టి పిచ్ నాణ్యత గురించి విదేశీ మీడియాలో చర్చ లేదు. ఒక వేళ భారత్ నెగ్గి ఉంటే మాత్రం తనకు అనుకూల వికెట్ తయారు చేసుకుని ప్రత్యర్థిని దెబ్బ తీసిందని.. పిచ్‌ల నాణ్యత ఇలా ఉంటే ఎలా అనే ప్రశ్నలు తలెత్తేవి.

**--తప్పక తగ్గించారా?**


ఈ యాషెస్‌లో తొలి టెస్టు రెండు రోజుల్లోనే ముగిసినా.. పెర్త్ పిచ్ గురించి విమర్శలు లేవు. మ్యాచ్ రిఫరీ కూడా దాని గురించి ప్రతికూల నివేదిక ఇవ్వలేదు. ఐసీసీ సైతం దానికి తక్కువ రేటింగ్ ఇవ్వలేదు. ఈ విషయంలో సునీల్ గావస్కర్ ఆశ్చర్యపోయారు. నాలుగో టెస్టు వేదిక మెల్‌బోర్న్‌లోనూ రెండు రోజుల్లోనే మ్యాచ్ ముగిశాక కూడా ఆస్ట్రేలియా, మీడియా నుంచి సరైన స్పందన లేదు. ఇక్కడి పిచ్ కొంచెం ఎక్కువ స్పందించిందని మాత్రమే కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. 'ఇవి మంచి పిచ్‌లు ఎలా అవుతాయి.. వీటికి మంచి రేటింగ్ ఎలా ఇస్తున్నారు?' అని సునీల్ గావస్కర్ మండిపడ్డాడు. స్టోక్స్, పీటర్సన్, దినేశ్ కార్తీక్ సహా పలువురి విమర్శల నేపథ్యంలో ఐసీసీ.. ఎంసీజీకి తక్కువ రేటింగ్ ఇవ్వక తప్పలేదు. ఈ మైదానానికి ఒక అయోగ్యతా పాయింటు కూడా కేటాయించింది. మరి చివరి టెస్టు వేదిక అయిన సిడ్నీలో పిచ్ ఎలా ఉంటుందో, మ్యాచ్ ఎన్ని రోజులు సాగుతుందో చూడాలి.

# పాక్ జట్టు కోచ్‌గా ఎందుకు వైదొలిగానంటే..: జేసన్ గిలెస్పీ



ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. అయితే అతడు అకస్మాత్తుగా తన పదవి నుంచి తప్పుకున్నాడు. దానికి గల కారణాన్ని తాజాగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. పాకిస్థాన్ జట్టును ఎందుకు వీడారని ఒక 'ఎక్స్' యూజర్ అడిగాడు. దానికి గిలెస్పీ బదులిచ్చాడు.

'అప్పుడు నేను పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నా. హెడ్ కోచ్‌నైన నాకు ఏమాత్రం సమాచారం ఇవ్వకుండానే పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ మా సీనియర్ అసిస్టెంట్ కోచ్‌ను తొలగించింది. అది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదనిపించింది. అలాగే ఇలాంటి మరిన్ని అవమానకర పరిస్థితులు ఎదురయ్యాయి.' అని గిలెస్పీ వివరించాడు. స్థానికంగా ఉండి కూడా కనెక్షన్ క్యాంప్‌నకు హాజరుకాని పీసీబీ చీఫ్ నఖ్వీ గురించి కొంతకాలంక్రితం గిలెస్పీ మాట్లాడాడు. దక్షిణాఫ్రికా నుంచి గ్యారీ కిర్‌స్టన్, ఆస్ట్రేలియా నుంచి నేను విమానంలో పాక్‌కు వెళ్లాం. కానీ నఖ్వీ.. లాహోర్‌లోనే ఉండి కూడా హాజరు కాలేదన్నాడు. 'గ్యారీ కిరిస్టెన్.. కనెక్షన్ క్యాంప్ గురించి గొప్ప ఆలోచనలతో ముందుకువచ్చాడు. పాకిస్థాన్ క్రికెట్ జట్టులోని ప్రతిఒక్కరూ ఆ సమావేశంలో తమ అనుభవాలను పంచుకున్నారు. నేను ఆస్ట్రేలియా నుంచి, గ్యారీ దక్షిణాఫ్రికా నుంచి విమానంలో వచ్చాం. కానీ పీసీబీ ఛైర్మన్ నఖ్వీ మాత్రం జూమ్ ద్వారా మాతో మాట్లాడాడు' అని గిలెస్పీ వాపోయాడు. 'అతడు లాహోర్‌లోనే ఉన్నాడు.. కానీ రాలేదు. ఛైర్మన్ ఆ సమావేశానికి రావడానికి 20 నిమిషాలు కూడా డ్రైవ్ చేయలేకపోయాడని మా ఇద్దరికీ అనిపించింది. అది కొంచెం అసాధారణం' అని జేసన్ గిలెస్పీ విమర్శించాడు.



# ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లోకి.. వీనస్ విలియమ్స్ రీఎంట్రీ

అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ ఐదేళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్‌లో పునరాగమనం చేస్తున్నారు. జనవరిలో ప్రారంభం కానున్న ఈ టోర్నీ కోసం ఆమెకు ఇప్పటికే వైల్‌డ్‌కార్డ్ ఎంట్రీ లభించింది. ఏడుసార్లు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ ఛాంపియన్ అయిన ఆమె.. కొన్ని రోజుల క్రితమే వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మోడల్, యాక్టర్ ఆండ్రియా ప్రెటిని పెళ్లి చేసుకున్నారు. జనవరి 18 నుంచి మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభం కానుంది. ఈ ఓపెన్ మెయిన్ డ్రాలో తలపడనున్న పెద్ద వయస్కురాలు వీనసే కావడం గమనార్హం. ఇప్పుడు ఆమె వయసు 46 ఏళ్లు. అంతకుముందు ఈ రికార్డు జపాన్‌కు చెందిన కిమికో డేట్ పేరిట ఉండేది. "ఆస్ట్రేలియా ఓపెన్‌లో పునరాగమనం చేయడంపై సంతోషంగా ఉన్నాను. ఇక్కడ నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి" అని వీనస్ సంతోషం వ్యక్తంచేశారు. 1998లో ఈ టోర్నమెంట్‌లో ఆమె అరంగేట్రం చేశారు. ఈ టోర్నీలో రెండుసార్లు సింగిల్స్ ఫైనల్‌కు చేరిన ఆమె.. 2003, 2017లో తన చెల్లెలు సెరెనా విలియమ్స్ చేతిలో ఓడి, రన్నరప్‌గా నిలిచారు.